క్లుప్తంగా

పోలీస్‌స్టేషన్‌లో ఓపెన్ హౌస్ కార్యక్రమం

గుమ్మలక్ష్మీపురం (కురుపాం): కురుపాం పోలీస్‌స్టేషన్ ఎస్ఐ పి.నారాయణరావు ఓపెన్ హౌస్ కార్యక్రమంతో పాటు వైద్య శిబిరం శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన విద్యార్థులకు శాంతిభద్రతల పరిరక్షణకు పోలీసులు నిర్వహించే విధులపై అవగాహన కల్పించారు. అలాగే హాజరైన విద్యార్థులకు వైద్య పరీక్షలు చేయించి అనారోగ్య సమస్యలతో ఉన్న వారికి మందులు అందజేశారు. పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

ప్రారంభమైన వాలీబాల్ పోటీలు


వాలీబాల్ పోటీల్లో తలపడుతున్న క్రీడాకారులు

పాలకొండ రూరల్: మండలంలోని పెదకోటిపల్లి గ్రామంలో శనివారం నుంచి జిల్లా వాలీబాల్ పోటీలు ప్రారంభమయ్యాయి. మహాశివరాత్రి 57వ యాత్రోత్సవాల్లో భాగంగా ఈ క్రీడా పోటీలను నిర్వాహకులు ఏర్పాటు చేశారు. తొలిరోజు 10 జట్లకు చెందిన క్రీడాకారులు తమ ప్రతిభ కనబర్చి వీక్షకులను కట్టిపడేశారు. ఆదివారం జరగనున్న తుది పోటీల్లో ప్రథమ స్థానం పొందిన జట్టుకు రూ.18వేలు, ద్వితీయ స్థానంలో నిలిచిన జట్టుకు రూ.7వేలు నగదు బహుమతి అందించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

విద్యుత్ లోడ్ క్రమబద్ధీకరణకు చర్యలు

పాలకొండ రూరల్: గృహ విద్యుత్ వినియోగదారులు వినియోగిస్తున్న విద్యుత్ అదనపు లోడు క్రమబద్ధీకరించేలా అవసరమైన చర్యలు చేపట్టినట్లు ట్రాన్స్‌కో ఈఈ టీజీకే మూర్తి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఏపీ విద్యుత్ నియంత్రణ మండలి, ఉన్నతాధికారుల ఆదేశాలలో 50 శాతం రాయితీ ఇస్తున్నామన్నారు. ఈ అవకాశం జూన్ 30వ తేదీ వరకూ ఉంటుందన్నారు. వినియోగదారులు నేరుగా విద్యుత్ సబ్‌స్టేషన్‌లో లేక ఆన్‌లైన్ విధానంలో దరఖాస్తులు చేయవచ్చన్నారు. నూతనంగా విద్యుత్ కనెక్షన్ తీసుకున్నప్పుడు ఇంట్లో ఉపకరణాల లోడ్ లెక్కించి సెక్యూరిటీ డిపాజిట్ తీసుకుంటారు. ఉదాహరణకు 1 కిలోవాట్ లోడ్‌తో కనెక్షన్ తీసుకుంటే సెక్యూరిటీ డిపాజిట్ రూ.200, డెవలప్‌మెంట్ ఛార్జీ రూ.2000, దరఖాస్తుకు రూ.200 వంతున ఎన్ని కిలోవాట్లు వాడితే ఈ లెక్కన అంత మొత్తం చెల్లించాల్సి ఉంటుంది. దీనిని అధిగమించేందుకు 50 శాతం రాయితీపై డెవలప్‌మెంట్ చార్జీ కిలోవాట్‌కు రూ.వెయ్యి కడితే సరిపోతుందన్నారు. ఇందుకు ముందుగా దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు.

గులిరాగి పద్ధతిలో అధిక దిగుబడులు

సీతంపేట: గులిరాగి పద్ధతిలో సాగు చేయడం వల్ల అధిక దిగుబడులు సాధించవచ్చని ప్రకృతి వ్యవసాయం స్టేట్ రిసోర్స్ పర్సన్ దేవుళ్లు అన్నారు. మండలంలోని నారాయణగూడ, బుడగరాయి, గడిగుడ్డిలో రాగి పంటను శనివారం పరిశీలించారు. దిగుబడులు ఎలా ఎక్కువ మొత్తంలో సాధించాలి, చీడపీడల నివారణా చర్యలు గూర్చి వివరించారు. సేంద్రీయ వ్యవసాయ సాగుతో అధిక లాభాలు పొందవచ్చని రైతులకు వివరించారు. కార్యక్రమంలో రిసోర్స్‌పర్సన్‌లు ముసలయ్య, బాలు, కామేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

మహిళలు అన్ని రంగాల్లో ముందుండాలి


గరుగుబిల్లిలో నిర్వహించిన ర్యాలీలో పాల్గొన్న తహసీల్దార్ బాల

గరుగుబిల్లి: మహిళలు అన్ని రంగాల్లో ముందు వరుసలో ఉండాలని మండల తహసీల్దార్ పి.బాల పేర్కొన్నారు. శనివారం మండల కేంద్రంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవ వారోత్సవాల్లో భాగంగా ఐసీడీఎస్, మండల వెలుగు సిబ్బంది ఆధ్వర్యంలో ర్యాలీని, మానవహారాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మహిళలు ఆర్థిక, సామాజిక, రాజకీయ రంగాల్లో రాణించాలన్నారు. మహిళల రక్షణకు పలు చట్టాలు అమల్లో ఉన్నాయని, వాటిని సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో కొమరాడ ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలోని గరుగుబిల్లి సెక్టార్ సూపర్‌వైజర్ ఆర్. లక్ష్మి, ఏపీఎం పి.అప్పలనాయుడు, సిబ్బంది పాల్గొన్నారు.

ఇస్రో విజయాలపై విద్యార్థులకు పోటీలు

వీరఘట్టం: మండల స్థాయి సైన్స్ డే ఉత్సవాల్లో భాగంగా శనివారం స్థానిక బాలికోన్నత పాఠశాలలో విద్యార్థులకు ఇస్రో విజయాలపై పోటీలను నిర్వహించారు. 3, 4, 5 తరగతుల విద్యార్థులకు పోస్టర్ ప్రజెంటేషన్‌పై పోటీలు నిర్వహించారు. 6, 7, 8, 9వ తరగతుల విద్యార్థులకు క్విజ్ పోటీలు నిర్వహించారు. 8, 9వ తరగతుల విద్యార్థులకు సెమినార్ నిర్వహించారు. ఈ మూడు విభాగాల్లో నిర్వహించిన పోటీలలో గెలుపొందిన విద్యార్థులకు ఎంఈఓ ఆర్.ఆనందరావు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో హెచ్.ఎం కె.పి.నాగమణి, సైన్సు ఉపాధ్యాయులు, సీఆర్‌పీలు, ఎమ్మార్సీ సిబ్బంది పాల్గొన్నారు.

కలెక్టర్ పొలం బాట

- బెంగాలీ కూలీల తాడు ఉడుపులు పరిశీలించిన కలెక్టర్
- మోడల్ స్కూల్ పరిశీలన

భామిని:

జిల్లా కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్ పొలం బాట పట్టారు. రైతులు, కూలీలతో మమేకమయ్యారు. పొలం పనుల గురించి ఆరా తీసి రైతుల నుంచి పలు విషయాలు తెలుసుకున్నారు. జిల్లా కలెక్టరే స్వయంగా రావడంతో రైతులు, కూలీలు ఒకింత ఆశ్చర్యానికి గురయ్యారు. వివరాల్లోకి వెళ్తే.. భామిని మండలం గురండి దగ్గర రబీ వరి పొలాల గట్లుపై కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్ శనివారం ఐటీడీఏ పీఓ యశ్వంత్‌కుమార్‌రెడ్డితో కలిసి బెంగాలీ నాట్లు వేసిన పొలాలను స్వయంగా పరిశీలించారు.


పొలాల వద్ద రైతులతో మాట్లాడుతున్న కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్, పీఓ యశ్వంత్‌కుమార్‌రెడ్డిలు

అనంతరం రైతులతో మాట్లాడి మన వ్యవసాయ కూలీలకు తాగు కొలుపు నాట్లు రావా అని అడిగి తెలుసుకున్నారు. కొందరు తాడు కొలుపు నాట్లు వేస్తున్నారని ఎంఈఓ సింహాచలం, హెచ్‌టీఓ జయశ్రీ వివరించారు. రైతులు స్థానిక కూలీలను ప్రోత్సహించాలన్నారు. అనంతరం బిల్లుమలో జీడిపప్పు ఫ్యాక్టరీని, జీడితొక్క నుంచి ఆయిల్ తీసే ఫ్యాక్టరీలను కలెక్టర్ బృందం నిశితంగా పరిశీలించి యజమాని గుడ్ల సత్యారావు నుంచి వివరాలు అడిగి తెలుసుకున్నారు. తరువాత రవాణా అంశాలు ఆరా తీశారు. అనంతరం భామిని ఏకలవ్య మోడల్ స్కూల్ విద్యార్థుల సమస్యలను నేరుగా పరిశీలించారు. మైదానం ఏర్పాటు, చుట్టూ ప్రహరీ నిర్మాణంపై గిరిజన సంక్షేమ శాఖ ఈఈ రమాదేవి, డీఈఈ సింహాచలంకు పలు సూచనలు చేశారు. కలెక్టర్ పర్యటనలో మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.

ఇంటర్ ఫస్టియర్ పరీక్షలో ఇబ్బందులు

వీరఘట్టం:

స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శనివారం జరిగిన ఇంటర్మీడియట్ ఫస్టియర్ పరీక్షలు విద్యార్థులను కొంత గందరగోళానికి గురి చేశాయి. ఉదయం 8 గంటలకు ప్రధాన గేట్ వద్ద ఓ అధ్యాపకుడు విద్యార్థుల హాల్ టికెట్లు పరిశీలించి వారిని కాలేజీ ప్రాంగణంలోకి అనుమతించారు. అయితే పరీక్ష గది, హాల్ టికెట్లు నంబర్లు విద్యార్థులు చూసుకునేందుకు వీలుగా ఏర్పాటు చేసిన బోర్డులో సరైన వివరాలు లేకపోవడంతో విద్యార్థులు ఇబ్బందులు పడ్డారు. కాలేజీ సిబ్బంది ఎవరూ ఈ బోర్డు వద్ద హాల్ టికెట్లు నంబర్లుగాని, పరీక్ష గదినిగాని చూపించేందుకు లేకపోవడంతో విద్యార్థులు పరీక్ష గదిని వెతుక్కునే పనిలో పడ్డారు. అలాగే ఉదయం 8.30 గంటల వరకు పరీక్ష గదులకు ఉన్న తాళాలు తీయకపోవడంతో కాలేజీ గ్రౌండ్‌లో ఎండలో విద్యార్థులు నిరీక్షించాల్సి వచ్చింది. అంతేకాక పరీక్షలకు సంబంధం లేని కొందరు ఆకతాయిలు యథేచ్ఛగా పరీక్ష గదుల్లో హల్‌చల్ చేశారు. ఇటువంటి చర్యలను నియంత్రించడంతో కాలేజీ ప్రిన్సిపాల్ పటిష్ట చర్యలు ఎందుకు తీసుకోలేదని తల్లిదండ్రులు ప్రశ్నించారు. అలాగే పరీక్ష రాయడానికి వీల్‌చైర్‌పై వచ్చిన గణేష్ అనే దివ్యాంగుడు కాలేజీ ప్రాంగణంలోకి వెళ్లేందుకు ర్యాంపు లేకపోవడంతో అవస్థలు పడ్డాడు. మొదటి రోజు తెలుగు పరీక్షకు 307 మంది విద్యార్థులు హాజరు కాగా 8 మంది గైర్హాజరైనట్లు ప్రిన్సిపాల్ డివిఎస్.త్రినాథ్ తెలిపారు.


కాలేజీలోకి వెళ్లేందుకు ర్యాంపు లేకపోవడంతో అవస్థలు పడుతూ వచ్చిన దివ్యాంగుడు గణేష్

ఉద్యోగులకు ఇచ్చిన హామీలు అమలు చేయాలి


ఎద్దు లిల్లీపుష్పనాథం

పాలకొండ: కూటమి ప్రభుత్వం ఎన్నికల ముందు ప్రభుత్వ ఉద్యోగులకు ఇచ్చిన హామీలు అమలు చేయాలని వైఎస్సార్‌సీపీ మన్యం జిల్లా ప్రభుత్వ ఉద్యోగుల, పెన్షనర్ల విభాగం అధ్యక్షుడు ఎద్దు లిల్లీ పుష్పనాథం డిమాండ్ చేశారు. పాలకొండలో ఆయన విలేకరులతో శనివారం మాట్లాడారు. 2024 సాధారణ ఎన్నికల ముందు కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడానికి ఎన్నో హామీలు ఇచ్చిందని తెలిపారు. ప్రభుత్వం ఏర్పడి తొమ్మిది నెలలు దాటుతున్నా ఒక్క హామీ కూడా నెరవేర్చలేదని ఆరోపించారు. ఉద్యోగులకు పీఆర్‌సీ వేసి మధ్యంతర భృతి ప్రకటిస్తామని చెప్పి ఆ విషయం బుట్ట దాఖలు చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. పదవీ విరమణ పొందిన ఉద్యోగులకు గ్రాట్యుటీ, ఏపీజీఎల్ఐ బాండ్లు మొత్తం, జీపీఎఫ్ అమౌంట్ అందించక పోవడం బాధాకరమని తెలిపారు. కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలు అమలు చేసి ఉద్యోగులకు న్యాయం చేయకపోతే తిరుగుబాటు తప్పదని హెచ్చరించారు. ఉద్యోగులపై నిరంకుశ ధోరణి విడనాడి వారి సంక్షేమానికి చర్యలు తీసుకోవాలని కోరారు.

పశువుల్లో గాలికుంటు వ్యాధి నివారణ తప్పనిసరి

- జిల్లా పశు సంవర్ధక శాఖ అధికారి


పశువైద్య శిబిరంలో సేవలు అందిస్తున్న మన్మధరావు, సిబ్బంది

పాలకొండ: పశువుల్లో గాలికుంటు వ్యాధి ప్రమాదకరమని, దాని నివారణకు విధిగా చర్యలు తీసుకోవాలని జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి శివ్వాల మన్మధరావు అన్నారు. పట్టణంలోని బోనం వీధిలో పశు వైద్య శిబిరం శనివారం నిర్వహించారు. గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాడి రైతులు తమ పశు సంపదను రక్షించుకునేందుకు తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు. గాలికుంటు వ్యాధి సోకిన పశువులు గిట్టలు, కాళ్ల మధ్యలో పుండ్లు ఏర్పడి, తీవ్రమైన జ్వరం సోకి ఆహారం తీసుకోలేక పశువుల చనిపోయే ప్రమాదం ఉందని తెలిపారు. ఈ వ్యాధి గుర్తించిన వెంటనే తమకు సమాచారం అందిస్తే వైద్యం అందించడం ద్వారా నష్టం కలగకుండా చర్యలు తీసుకోవచ్చునని తెలిపారు. ఇందుకోసం పశు వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. రైతులు ఈ అవకాశం సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. శిబిరంలో ఏడీ మాణిక్యాలరావు, మండల పశువైద్యాధికారి సిద్ధార్థ సిబ్బంది పాల్గొన్నారు.

యాప్‌పై వెలుగు సిబ్బందికి శిక్షణ


కురుపాం వెలుగు కార్యాలయంలో శిక్షణ ఇస్తున్న సెర్ప్ ఈఎంటీ కుసుమకుమారి

గుమ్మలక్ష్మీపురం (కురుపాం): కురుపాం, గుమ్మలక్ష్మీపురం, జియ్యమ్మవలస, కొమరాడ మండలాలకు చెందిన గ్రామైఖ్య సంఘాల సభ్యులకు, వీఓఏలకు కురుపాం వెలుగు కార్యాలయం వద్ద లోకోస్ యాప్‌పై శనివారం శిక్షణ ఇచ్చారు. శిక్షణ కార్యక్రమంలో పాల్గొన్న సెర్ప్ ఈఎంటీ కుసుమకుమారి మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి పొందుతున్న పథకాలు, నెల నెలా చేసే పొదుపులను లోకోస్ యాప్‌లో నిక్షిప్తం చేయాలని, తద్వారా మహిళా సంఘాలకు చెందిన సమగ్ర నివేదిక అందుబాటులో ఉంటుందన్నారు. డ్వాక్రా సంఘాల బలోపేతం, ఆర్థికాభివృద్ధి, సంపూర్ణ పేదరిక నిర్మూలనే ధ్యేయంగా శిక్షణ అందివ్వడం జరుగుతుందన్నారు. వెలుగు ఏపీఎంలు బి.వెంకట్, జి.సింహాచలం, సీసీలు ఉన్నారు.

ఎమ్మెల్సీ విక్రాంత్ పరామర్శ


ఆదినారాయణ కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న ఎమ్మెల్సీ విక్రాంత్ తదితరులు

పాలకొండ రూరల్: మండలంలోని జి.వెంకటాపురం గ్రామానికి చెందిన బబ్బాది ఆదినారాయణ ఇటీవల మృతి చెందగా విషయం తెలుసుకున్న ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్ శనివారం ఆ కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఆదినారాయణ డోలమడ సర్పంచ్‌గా ఎన్నో సేవలు అందించారన్నారు. ఆదినారాయణ కుటుంబసభ్యులకు పార్టీ అండగా ఉంటుందని ఎమ్మెల్సీ భరోసా ఇచ్చారు. ఆయన వెంట పార్టీ మండల కన్వీనర్, వైస్ ఎంపీపీ కనపాడ సూర్యప్రకాష్, ఎంపీటీసీ పాండ్రంకి హైమావతి, పార్టీ ముఖ్య నాయకులు రణస్థలం రాంబాబు, కోట బాబూరావునాయుడు, నేతల శిమ్మినాయుడు, గులివిందల రామచంద్ర, లావేటి శ్యామ్‌బాబు, కోట కృష్ణంనాయుడు, చింత రాజేష్ తదితరులు ఉన్నారు.

అలరించిన విద్యార్థుల నృత్యాలు



నృత్యాలు చేస్తున్న విద్యార్థులు

భామిని: మండలంలోని బత్తిలి జెడ్పీ హైస్కూల్‌లో శనివారం జరిగిన పదో తరగతి విద్యార్థుల వీడ్కోలు కార్యక్రమంలో చిన్నారుల నృత్యాలు అలరించాయి. హెచ్‌ఎం ఆర్.వెంకటరమణ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో విద్యార్థులు పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. టెన్త్‌లో మంచి ఫలితాలు సాధించాలని హెచ్‌ఎం ఆకాంక్షించారు.

ఉపాధి పనులపై సమీక్ష



పాలకొండ నియోజకవర్గంలో ఉపాధి పనులు పూర్తి ప్రమాణాలతో జరపాలని డ్వామా పీడీ కె.రామచంద్రరావు సూచించారు. పాలకొండ ఎంపీడీఓ కార్యాలయంలో నాలుగు మండలాలకు చెందిన ఉపాధి ఏపీఓలు, టెక్నికల్ సహాయకులు, ఈసీలు, టీఏలతో పంచాయతీల వారీగా శనివారం సమీక్షించారు. ప్రస్తుతం జాబ్‌కార్డుదారుల సంఖ్య, చేపడుతున్న పనులపై ఆరా తీశారు. ఫారం పాండ్లు, వ్యక్తిగత నీటి కుంటలు, కాంపౌండ్ వాల్స్, మినీ గోకులాల నిర్మాణాల తాజా స్థితిగతులను ఏపీఓల ద్వారా తెలుసుకున్నారు. డీఎల్‌డీఓ వీవీ గోపాలకృష్ణ, ఎంపీడీఓ వీవీ రంగారావు, ఉపాధి అధికారులు, క్షేత్ర సిబ్బంది పాల్గొన్నారు. – పాలకొండ రూరల్

ఆధ్యాత్మిక చింతన



పాలకొండ మండలంలోని తంపటాపల్లి గ్రామంలో ఒకే పానమట్టంపై కొలువుదీరిన శ్రీ ఉమామహేశ్వర, వీరభద్ర స్వాముల ఆలయంలో ప్రత్యేక అభిషేకాలు శనివారం జరిపారు. మహా శివరాత్రి పర్వదినాల్లో భాగంగా సామూహిక బిల్ల, విశేష జల అర్చన కార్యక్రమాలు వైభవంగా గ్రామస్తులు చేపట్టారు. ఈ క్రమంలో స్వామివార్లను అర్చకులు విశేషంగా అలంకరించారు. భక్తుల శివనామ స్మరణతో ఆలయ ఆవరణలో ఆధ్యాత్మిక చింతన నెలకొంది. – పాలకొండ రూరల్

నేడు గట్టాలమ్మ పునఃప్రతిష్ఠ



మండలంలోని రావుపల్లిలో శ్రీగట్టాలమ్మ తల్లి గ్రామదేవత పునఃప్రతిష్ఠ మహోత్సవం ఆదివారం నిర్వహించనున్నట్టు గ్రామ పెద్దలు, యువత శనివారం తెలిపారు. ఇందులో భాగంగా మార్చి 2 ఆదివారం ఉదయం 11 గంటలకు దారు విగ్రహ ప్రతిష్ఠ, పూర్ణపు కలశ ప్రతిష్ఠ మహోత్సవం నిర్వహించనున్నట్లు తెలిపారు. పూజా కార్యక్రమాలు అనంతరం అమ్మ వారి సన్నిధిలో మధ్యాహ్నం అన్న సమారాధన కార్యక్రమం జరపనున్నట్లు పేర్కొన్నారు. భక్తులు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. –గరుగుబిల్లి

గాలికుంటు వ్యాధి టీకాలు వేయించాలి

గరుగుబిల్లి: జాతీయ పశువ్యాధి నియంత్రణ పథకంలో భాగంగా పశువులకు గ్రామాల్లో వైద్య శిబిరాలు ద్వారా గాలికుంటు వ్యాధికి వేస్తున్న టీకాలను పాడి రైతులు సద్వినియోగం చేసుకోవాలని పశువైద్యాధికారి సురేష్‌కుమార్ పేర్కొన్నారు. మండలంలోని రావివలస గ్రామంలో పశువైద్య శిబిరాన్ని శనివారం నిర్వహించారు. పాడి పశువులకు టీకాలను వేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గాలికుంటు వ్యాధి సోకితే తీవ్రమైన జ్వరం, నీరసంతో పాటు నోటి నుండి సొంగ కారడం, నోరు, కాలిగిట్ల మధ్య పుండ్లు తదితర లక్షణాలు కన్పిస్తాయన్నారు వ్యాధి సోకితే పాల ఉత్పత్తి గణనీయంగా తగ్గిపోతుందన్నారు. వ్యాధి సోకిన ఆవు నుంచి పాలు దూడ తాగితే మరణాలు కూడా సంభవిస్తాయన్నారు. వ్యాధి సోకకుండా వ్యాధి నిరోధక టీకాలు వేస్తే ఎంతో లాభదాయకంగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో పశువైద్య సిబ్బంది మంత్రబుద్ధి శ్రీరాముల నాయుడు తదితరులున్నారు.

ప్రారంభమైన ఇంటర్ పరీక్షలు

ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సర పరీక్షలు శనివారం అన్ని కేంద్రాల్లో ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. తొలి రోజు విద్యార్థులు ఉత్సాహంగా పరీక్షలకు హాజరయ్యారు. కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్ కురుపాంలో ఇంటర్ పరీక్ష కేంద్రాన్ని పరిశీలించారు. పరీక్షలు ప్రశాంతంగా జరిపేందుకు చీఫ్ సూపరింటెండెంట్లు, డిపార్టుమెంటు అధికారులు అన్ని చర్యలు చేపట్టారు. మరోవైపు పరీక్ష కేంద్రాల వద్ద ఎటువంటి అవాంఛీయ సంఘటనలు జరగకుండా పోలీసులు గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు. – సాక్షి నెట్‌వర్క్


గుమ్మలక్ష్మీపురం(కురుపాం): కురుపాం ఇంటర్ పరీక్ష కేంద్రం వద్ద అధికారులకు సూచనలు చేస్తున్న కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్


జియ్యమ్మవలస రూరల్: పరీక్షకు వెళ్తున్న విద్యార్థులు


కొమరాడ: జూనియర్ కళాశాల ఆవరణలో తమకు కేటాయించిన గదులను పరిశీలిస్తున్న విద్యార్థులు


సీతంపేట: బాలికల కళాశాల వద్ద రూం నంబర్లు చూస్తున్న విద్యార్థులు


గుమ్మలక్ష్మీపురం : ప్రభుత్వ జూనియర్ కళాశాల పరీక్ష కేంద్రం నుంచి పరీక్ష రాసి బయటకు వస్తున్న ఇంటర్ విద్యార్థులు

అంతర్జాతీయ మహిళా దినోత్సవ వారోత్సవాలు ప్రారంభం


కురుపాం మండల కేంద్రంలో విద్యార్థులతో కలిసి ర్యాలీని నిర్వహిస్తున్న సీడీపీఓ విజయగౌరి, ఎంపీడీఓ ఉమామహేశ్వరి

గుమ్మలక్ష్మీపురం/గుమ్మలక్ష్మీపురం(కురుపాం): గుమ్మలక్ష్మీపురం మండలంలోని భద్రగిరి సీడీపీఓ రాజ్యలక్ష్మి, కురుపాం మండల కేంద్రంలో సీడీపీఓ కె.విజయగౌరి ఆధ్వర్యంలో శనివారం రాబోయే అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని వారోత్సవాలు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా మండలాల్లో ఎంపీడీఓలు ఎస్.సాల్మన్‌రాజు, జె.ఉమామహేశ్వరి ఇతర శాఖల అధికారులు, అంగన్‌వాడీ సిబ్బంది, విద్యార్థులతో కలిసి అవగాహన ర్యాలీలు నిర్వహించారు. ర్యాలీలో లింగ వివక్ష మరియు బాలికల విద్య, ఆరోగ్యం గూర్చి నినాదాలు చేశారు. ఈ సందర్భంగా సీడీపీఓలు మాట్లాడుతూ మార్చి 8వ తేదీ వరకు ఈ కార్యక్రమాన్ని వివిధ రూపాల్లో నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

విద్యతోనే ఉజ్వల భవిష్యత్

గుమ్మలక్ష్మీపురం: విద్యార్థి దశలో ఉన్న ప్రతీ ఒక్కరూ చదువే ప్రధానంగా ముందుగు సాగాలని ఎంపీడీఓ ఎస్.సాల్మన్‌రాజు అన్నారు. గుమ్మలక్ష్మీపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 2024 - 2025కు చెందిన పదో తరగతి విద్యార్థుల వీడ్కోలు కార్యక్రమం శనివారం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఎంపీడీఓ మరియు సర్పంచ్ బొత్తాడ గౌరీశంకరరావు విద్యార్థులతో మాట్లాడుతూ.. విద్యార్థి దశను మార్చేది టెన్త్ క్లాసేనని, రాబోవు పబ్లిక్ పరీక్షల్లో మంచి మార్కులతో ఉత్తీర్ణత సాధించి జీవితాన్ని చక్కదిద్దుకోవాలంటూ సూచనలు చేశారు. అనంతరం ఆ పాఠశాలకు చెందిన రిటైర్డ్ ఉపాధ్యాయులు ఎం.సీతన్న టెన్త్ విద్యార్థులకు పరీక్షలు రాసేందుకు వీలుగా ఫ్లాంక్‌తో పాటు పెన్నులు, పెన్సిళ్లను అందజేశారు. టెన్త్ విద్యార్థులు తమ జ్ఞాపకంగా పాఠశాలకు మైక్ సిస్టంను బహుమతిగా అందజేశారు. కార్యక్రమంలో ఎంఈఓ బిడ్డిక భీముడు, వైస్ సర్పంచ్ కిషోర్‌కుమార్, పాఠశాల కమిటీ చైర్మన్ రాజేష్, పలువురు ఉపాధ్యాయులు ఉన్నారు.

సాక్షి
సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
పాలకొండ / కురుపాం
9951602844, 9010204441
Office mail : vzmadvt@gmail.com